సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



అతి చిన్న పంచాయతీ..

ఆళ్లపల్లి మండలంలోని అడవి రామవరం గ్రామ పంచాయతీ 85 మంది ఓటర్లతో జిల్లాలోనే అతిచిన్న జీపీగా నమోదైంది. 8లో



పోటెత్తిన ఆయిల్‌పామ్ గెలలు

దమ్మపేట మండలం అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలకు శనివారం ఆయిల్‌పామ్ గెలలు పోటెత్తాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 24°

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం ఒకటి, రెండు చోట్ల చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

గణంగా వీడ్కోలు !

గంగమ్మ ఒడికి చేరిన వినాయక విగ్రహాలు ● జిల్లాలో ఘనంగా నిమజ్జనోత్సవాలు



గోదావరిలో నిమజ్జనానికి లాంచీలో తరలిస్తున్న వినాయక విగ్రహాలు

నవరాత్రుల పాటు పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. జిల్లా వ్యాప్తంగా శనివారం గణపతి శోభాయాత్రలు, నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శోభాయాత్రను ప్రారంభించగా.. పలు ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు హాజరై విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. భద్రాచలం వద్ద వినాయక నిమజ్జనోత్సవాలను ఎస్పీ రోహిత్‌రాజుతో పాటు పలువురు అధికారులు పరిశీలించి భక్తులకు సూచనలు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం రాత్రి 8 గంటల వరకు గోదావరిలో 1091 విగ్రహాలను నిమజ్జనం చేయగా, అర్ధరాత్రి దాటాక కూడా వేడుక కొనసాగింది. ఆదివారం చంద్రగ్రహణం ఉండడంతో కొందరు సోమవారం కూడా నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే జిల్లాలో ప్రతిష్ఠించిన వాటిలో అత్యధిక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం శనివారమే పూర్తయింది. – భద్రాచలంఅర్బన్/కొత్తగూడెంటౌన్



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శోభాయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని తదితరులు



కొత్తగూడెం కూలీలైన్‌లో వినాయక శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు పర్ణశాల ఆలయం మూసివేత

దుమ్ముగూడెం : చంద్రగ్రహణం సందర్భంగా పర్ణశాల రామాలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు మూసివేస్తామని ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ తలుపులు తెరిచి సంప్రోక్షణ, వైదిక కార్యక్రమాల అనంతరం 7.30 గంటలకు దర్శనాలు పునఃప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెంటౌన్: ఈనెల 13న కొత్తగూడెం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. సివిల్, చీటింగ్, భూ తగాదాలు, చిట్‌ఫండ్, బ్యాంక్ లావాదేవీలు, కుటుంబ తగాదాలు, వివాహ సంబంధ తదితర రాజీ కాదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించి జిల్లాను ఉన్నత స్థానంలో నిలిపేందుకు పోలీసు అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పోలీసుల సూచనలు పాటించాలి : ఎస్పీ



నిమజ్జన ఘాట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాచలంఅర్బన్ : గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ముగించుకుని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం వద్ద గోదావరి నదిలో విగ్రహాల నిమజ్జనానికి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా నిమజ్జన వేడుకలు పూర్తి చేయాలని ఎస్పీ రోహిత్‌రాజు కోరారు. గోదావరి ఘాట్‌ను శనివారం ఆయన సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో డీజేలు, బాణాసంచా కాల్చడం నిషేధమని, చట్టానికి విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భద్రాచలంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టామని వివరించారు. ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. నిమజ్జనోత్సవంలో జాప్యం జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ నాగరాజు, డీఎల్‌పీఓ సుధీర్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, ఇరిగేషన్ డీఈఈ మధుసూదన్, జేఈ వెంకటేశ్ పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం : గణేశ్ నిమజ్జనోత్సవాల సందర్భంగా భక్తులు పలు జాగ్రత్తలు పాటించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. ఐటీడీఏ కార్యాలయ సిబ్బంది క్వార్టర్ల వద్ద గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం న్నదాన కార్యక్రమం నిర్వహించగా పీఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా జరుపుకునే ఈ వేడుకలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. పోలీసులు, ఇతర అధికారులు సూచనలు పాటిస్తూ విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏటీడీఓ అశోక్ కుమార్, డీఈ హరీష్, టీఏ శ్రీనివాస్, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ లక్ష్మీనారాయణ, ఈఈ వెంకటస్వామి, డీడీ ప్రమీలాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

వైరా 'కారు'లో వార్!

- నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో ఎవరి దారి వారిదే
- దిశానిర్దేశం లేక కేడర్‌లో నిస్తేజం
- జిల్లా పార్టీ అనుమతి లేకుండానే మండల కమిటీలు
- ఆఫై రద్దు చేస్తూ జిల్లా అధ్యక్షుడి ప్రకటన



సాక్షిప్రతినిధి, ఖమ్మం: వైరా నియోజకవర్గ బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య పోరు జిల్లా పార్టీకి తలనొప్పులు తెస్తోంది. ఎవరి అనుమతి లేకుండానే నియోజకవర్గంలోని కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు మండలాల కమిటీలను నియమించడం చర్చనీయాంశంగా మారింది. ఈ నియోజకవర్గం రెండు జిల్లాల పరిధిలో ఉండగా అటు భద్రాద్రి, ఇటు ఖమ్మం జిల్లా అధ్యక్షుల ఆదేశాల మేరకే జూలూరుపాడు కమిటీ ఎన్నిక జరిగిందని అక్కడి నేతలు ప్రకటించారు. కానీ ఎవరి ఆమోదం లేదని, ఇది పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడమేనంటూ కమిటీలను రద్దు చేస్తూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఒక ప్రకటన విడుదల చేయడం గమనార్హం.

బహు నాయకత్వంతో గందరగోళం

భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) అధికారంలో ఉన్న పదేళ్లు వైరా నియోజకవర్గంలో బహు నాయకత్వం రాజ్యమేలింది. 2014 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున బానోతు చంద్రావతి పోటీ చేసి ఓడిపోగా.. ఆ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి గెలిచిన బానోతు మదన్‌లాల్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆపై 2018లో బానోతు మదన్‌లాల్ ఓడిపోగా, స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన రాములు నాయక్ బీఆర్‌ఎస్‌లోకి వచ్చారు. బీఆర్‌ఎస్‌లో మొదటి నుంచి ఉన్న నేతలకు ఆదరణ దక్కకపోగా.. ప్రతీ ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీలోకి వస్తుండడంతో నాయకులు పెరిగి పార్టీ కేడర్‌లో అసంతృప్తికి కారణమైంది. కాగా, బీఆర్‌ఎస్‌లో మదన్‌లాల్ తనకంటూ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నాక రాములునాయక్ చేరడంతో రాజకీయాలు మలుపు తిరిగాయి. పార్టీ కేడర్ రెండు వర్గాలుగా విడిపోవడమే కాక మదన్‌లాల్, రాములునాయక్ అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తూ పార్టీ కార్యక్రమాలను వేర్వేరుగానే నిర్వహించారు. అయినా జిల్లా, రాష్ట్ర నాయకత్వాలు వర్గపోరును ఆపలేకపోయాయి. చివరకు 2023లో పార్టీ తరఫున మదన్‌లాల్‌కు టికెట్ ఇచ్చినా విజయం దక్కలేదు.

చుక్కాని లేని నావలా..

అధికారంలో ఉండగా బహు నాయకత్వంతో ఇబ్బంది పడిన వైరా నియోజకవర్గ బీఆర్‌ఎస్ శ్రేణులు.. అధికారం కోల్పోయాక నాయకత్వ సమస్య ఎదుర్కొంటున్నాయి. 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధిష్టానం మదన్‌లాల్‌కు టికెట్ ఇవ్వగా, సిట్టింగ్ ఎమ్మెల్యే రాములునాయక్‌ను బుజ్జగించినప్పటికీ ఆయన రాజీనామా చేశారు. అయితే, మదన్‌లాల్‌కు ఓటమి ఎదురుకావడం, ఆపై ఆయన మృతితో నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు నాయకత్వం కరువైంది. ప్రతిపక్షంలో ఉండడంతో ఏ ఆందోళన నిర్వహించాలన్నా సమన్వయం చేసే వారు లేకపోగా, మండల కమిటీల నియామకం కూడా కొన్నిచోట్ల జరగలేదు.

ఎవరికి వారే..

ఎన్నికల్లో ఓటమితో బీఆర్‌ఎస్‌లో నైరాశ్యం నెలకొని, పార్టీ కేడర్‌ను పట్టించుకునే నాయకుడు కరువయ్యాడు. ఈక్రమంలోనే మండల కమిటీలు లేకపోగా అటు రాష్ట్ర, ఇటు జిల్లా అధిష్టానం అనుమతి లేకుండానే జూలూరుపాడు, ఏన్కూరు, కొణిజర్ల మండల కమిటీలను నియమించుకోవడం వివాదాస్పదమైంది. జూలూరుపాడులో గత నెల 31న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అధ్యక్షులు రేగా కాంతారావు, తాతా మధుసూదన్ అనుమతితో కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పగా, ఆతర్వాత ఏన్కూరు, కొణిజర్ల మండల కమిటీలు కూడా ఏర్పాటయ్యాయి.

ఆ నియామకాలు చెల్లవు

మండల కమిటీల నియామకాలు చెల్లవని తాజాగా బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ ప్రకటించారు. అధిష్టానం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే గ్రామ, మండల, జిల్లా కమిటీల నియామకాలు జరుగుతాయని, అప్పటి వరకు చేపట్టే నియామకాలు చెల్లవని పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం చర్చనీయాంశంగా మారింది.

'పరిషత్'కు కసరత్తు షురూ..

చుంచుపల్లి: మండల, జిల్లా పరిషత్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొన్ని నెలలుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో మార్పులు, చేర్పుల ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. జిల్లాలోని 22 జెడ్పీటీసీలు, 233 ఎంపీటీసీ స్థానాల ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా విడుదలకు షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితాను ఈనెల 2న ప్రకటించిన అధికారులు ఆ వివరాల ఆధారంగా ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటరు జాబితా రూపొందించనున్నారు. ఈ క్రమంలో శనివారం జిల్లా పరిషత్ అధికారులు ముసాయిదా జాబితా విడుదల చేశారు. ఈనెల 8వరకు వీటిపై అభ్యంతరాల స్వీకరణ, అదే రోజు జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించనున్నారు. 9న అభ్యంతరాల పరిష్కారం, 10న తుది ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాలు ప్రకటిస్తారు. స్థానిక సంస్థల పోరుకు ఎన్నికల సంఘం ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా నిర్వహించేందుకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉన్నారు.

అన్నదాతకు తప్పని పాట్లు



నెల్లిపాక పీఏసీఎస్ వద్ద బారులుదీరిన రైతులు



టేకులపల్లిలో క్యూలో నిల్చున్న రైతులు

యూరియా కోసం అవే బారులు

అశ్వాపురం/టేకులపల్లి : రైతులను యూరియా కష్టాలు వీడడం లేదు. విక్రయ కేంద్రాల వద్ద బారులుదీరడం తప్పడం లేదు. అశ్వాపురం మండలం నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద శనివారం తెల్లవారుజాము నుంచే రైతులు క్యూ కట్టారు. ఒక్కొక్కరికి రెండు బస్తాలు మాత్రమే విక్రయించడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా అందరికీ సరిపోక కొందరు నిరాశగా వెనుదిరిగారు. టేకులపల్లి పీఏసీఎస్‌కు కూడా రైతులు భారీగా చేరుకుని క్యూలో నిల్చున్నారు. మధ్యాహ్నం భారీ వర్షం పడగా, కార్యాలయ వరండాలో నిల్చోవాలని అధికారులు సూచించారు. దీంతో వరుస క్రమం తప్పగా రైతుల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. పోలీసులు చేరుకుని రైతులను శాంతింపజేశారు.

ఎకో టూరిజం అభివృద్ధికి కృషి

పీసీసీఎఫ్ సువర్ణ వెల్లడి



కిన్నెరసానిలోని ఆనందద్వీపానికి బోటులో వెళ్తున్న పీసీసీఎఫ్ సువర్ణ, సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్

పాల్వంచరూరల్ : కిన్నెరసాని అభయారణ్యంలో ఎకో టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) డాక్టర్ సువర్ణ అన్నారు. మండల పరిధిలోని కిన్నెరసానిని శనివారం సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ జి.కిష్టాగౌడ్, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బాబుతో కలిసి ఆమె సందర్శించారు. వాచ్‌టవర్, డీర్‌పార్కు, అద్దాలమేడ, కాటేజీలు, కిన్నెరసాని జలాశయం మధ్యలో ఉన్న ఆనందద్వీపాన్ని బోటులో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎకో టూరిజం అభివృద్ధి చేసి పర్యాటకులకు ఆహ్లాదంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రెక్కింగ్, సఫారీ టూర్ మ్యాప్‌ను సిద్ధం చేసి వారం రోజుల్లో పంపించాలని ఆదేశించారు.

అటవీ శాఖ సిబ్బంది క్వార్టర్లు ప్రారంభం

అశ్వాపురం: మండల పరిధిలోని మనుబోతుల గూడెంలో నిర్మించిన అటవీ శాఖ సిబ్బంది క్వార్టర్లను పీసీసీఎఫ్ సువర్ణ ప్రారంభించారు. క్వార్టర్ల ఆవరణలో అటవీ శాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మనుబోతులగూడెంని ప్లాంటేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సీసీఎఫ్, డీఎఫ్‌ఓతో పాటు ఎఫ్‌డీఓ మక్సూద్, ఎఫ్ఆర్ఓ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల విస్తరణకు కృషి చేయాలి

భద్రాచలంటౌన్: నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో అడవుల విస్తరణకు కృషి చేయాలని పీసీసీఎఫ్ సువర్ణ అధికారులను ఆదేశించారు. భద్రాచలంలో శనివారం ఆమె సీసీఎఫ్ క్యాంప్ కార్యాలయాన్ని, దుమ్ముగూడెంలో క్వార్టర్లను ప్రారంభించారు. అనతరం టింబర్ డిపోతో పాటు నర్సరీని పరిశీలించి మాట్లాడారు. అడవుల సంరక్షణ బాధ్యత సిబ్బందిపై ఉందని, సమన్వయంతో విధులు నిర్వహించి వనాలను కాపాడాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినతి..

మణుగూరు టౌన్: ఆళ్లపల్లి, అశ్వాపురం, బూర్గంపాడు పినపాక మండలాల్లో ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సువర్ణను కోరారు. ఈ మేరకు మణుగూరులో శనివారం వినతిపత్రం అందించారు. రహదారులు లేక గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందని అన్నారు. ఆయన వెంట సింగరేణి ఏరియా జీఎం దుర్గం రాంచందర్ ఉన్నారు.

ఆధునిక పద్ధతుల్లో సాగు చేయాలి

ట్రైయినీ కలెక్టర్ సౌరభ్ శర్మ



వ్యవసాయ కళాశాల ఆవరణలో పంటను పరిశీలిస్తున్న సౌరభ్ శర్మ

అశ్వారావుపేటరూరల్/మణుగూరురూరల్ : ఆధునిక సాంకేతిక విధానంలో పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలని ట్రెయినీ కలెక్టర్ సౌరభ్ శర్మ అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. బోధన సిబ్బందితో మాట్లాడి వ్యవసాయ కోర్సులు, ఉన్నత విద్య తదితర అంశాలపై ఆరా తీశారు. ఉద్యానతోటల్లో అంతర పంటల సాగు, పంటల వైవిధ్యం, నూతన సాంకేతికతతో విద్యార్థులకు బోధన, మామిడి దేశ, విదేశీ వంగడాలు, కొబ్బరి తోటల్లో అంతర పంటల సాగు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్ డాక్టర్ ఐ.వి. శ్రీనివాసరెడ్డి, ఏఓ శివరామ ప్రసాద్, ఏఈఓ ఆరేపల్లి సతీష్, బోధన సిబ్బంది రాంప్రసాద్, కె. శిరీష, టి. శ్రావణ్‌కుమార్, స్రవంతి, జాంబమ్మ, జెమీమ, దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటల సాగుపై సమీక్ష

మణుగూరు మండలం గుట్టమల్లారం రైతు వేదికను సౌరభ్ శర్మ శనివారం సందర్శించారు. రైతువేదిక ప్రాంగణంలో మొక్క నాటిన తర్వాత పంటల సాగు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతపై అధికారులతో చర్చించారు. పంటల నమోదు, పంట కోత ప్రయోగాలు, ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, బయో చార్కోల్, కంపోస్ట్ ఎరువు తయారీ, మునగ సాగు తదితర అంశాలను అధికారులు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ బి.తాతారావు, ఏఓలు వెంకటేశ్వర్లు, చటర్జీ, రాహుల్‌రెడ్డి, ఏఈఓలు కొమరం లక్ష్మణ్‌రావు, నాగేశ్వరరావు, హారిక, రమేష్, రమాదేవి, సౌమ్య, సిబ్బంది సత్యనారాయణ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొక్కలు నాటి పరిరక్షించాలి

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య



మొక్క నాటుతున్న అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య

చర్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య పిలుపునిచ్చారు. బయోడైవర్సిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఐటీసీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కొయ్యూరు శివారు అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు సోడి చలపతి, ఇందుల బుచ్చిబాబు, బండారు రామకృష్ణ, మేడిచర్ల వీరకుమార్, ఆవుల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరు రూరల్: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా. అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, నాయకులు లక్ష్మణ్, ముత్యంబాబు, అడపా అప్పారావు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ఆవుల నర్సింహారావు, వేర్పుల సురేష్, అక్కి నర్సింహారావు, మేకల రవి, జావిద్‌పాషా, బోశెట్టి రవి, గుర్రం సృజన్ పాల్గొన్నారు.

సింగరేణిలో 49 మంది అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని ఈఅండ్ఎం విభాగంలో పనిచేస్తున్న 49 మంది అధికారులను బదిలీ చేస్తూ శనివారం రాత్రి కార్పొరేట్ ఈఈ సెల్ హెచ్‌వోడీ ఏజీ మురళీధర్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఐదుగురు ఏజీఎంలు, ఏడుగురు డిజీఎంలు, 19 మంది ఎస్ఈలు, 10 మంది డీవైఎస్ఈలు, ఆరుగురు ఈఈలు, ఇద్దరు జేఈలు ఉన్నారు. వీరంతా ఈ నెల 19లోపు కేటాయించిన ప్రదేశాల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీజే సౌండ్‌కు కుప్పకూలిన మహిళ

నేలకొండపల్లి: వినాయక నిమజ్జనంలో ఏర్పాటు చేసిన డీజే శబ్దంతో ఓ మహిళ అస్వస్థతకు గురైంది. మండలంలోని మంగాపురంతండా లో శనివారం రాత్రి గణేశ్ శోభాయాత్ర జరుగుతుండగా డీజే పాటలకు అనుగుణంగా భూక్యా పార్వతి నృత్యం చేస్తోంది. ఈ క్రమంలో ఆమె కుప్పకూలగా స్థానికంగా చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అలాగే, మండల కేంద్రంలో వినాయక శోభాయాత్రలో భాగంగా బాణసంచా కాల్చేక్రమాన ప్రమాదంజరిగింది. ఈ ఘటనలో ఓ యువకుడికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతి

తిరుమలాయపాలెం: మేకలు మేపేందుకు వెళ్లి చెట్టుకొమ్మలు కొడుతున్న క్రమాన విద్యుదాఘాతానికి గురైన కాపరి మృతి చెందాడు. మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన ఇస్లావత్ సక్లాల్ (26) వ్యవసాయంతో పాటు మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం మేకలతో అడవికి వెళ్లిన ఆయన చెట్ల కొమ్మలు కొట్టి వేస్తుండగా, ఆపైన ఉన్న విద్యుత్ లైన్ తాకడంతో షాక్‌కు గురై పక్కనే బావిలో పడ్డాడు. కొద్దిసేపటికి గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని బయటకు తీయించారు. సక్లాల్‌కు భార్య సరిత ఉంది. ఆయన తండ్రి నాగులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో లేగదూడ..

నేలకొండపల్లి: చెరువుమాధారంలో కుక్కలుదాడి చేయగా లేగ దూడ మృతి చెందింది.గ్రామానికి చెంది న రైతు తెల్లగొర్ల అనిల్ అప్పుడే పుట్టిన లేగ దూడను శనివారం పశువుల కొట్టంలో పడుకోబెట్టాడు. ఈక్రమాన కుక్కల గుంపు దాడిచేసి దూడనుఈడ్చుకెళ్లి దాడి చేయడంతో చనిపోయింది. మరికొన్ని పశువుల వెంట పడడంతో స్థానికులు స్పందించగా కుక్కలు పారిపోయాయి.

అతి చిన్న పంచాయతీ..

అడవి రామవరం



పంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్న అడవి రామవరం పాఠశాల

- గ్రామంలో ఓటర్లు 85 మంది
- పంచాయతీలో నాలుగు వార్డులు

చుంచుపల్లి: ఆళ్లపల్లి మండలంలోని అడవి రామవరం జిల్లాలోనే అతి తక్కువ ఓటర్లు ఉన్న గ్రామ గ్రామపంచాయతీగా నిలిచింది. గ్రామంలో కేవలం 85 మంది మాత్రమే ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 40 మంది, పురుషులు 45 మంది ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఈ నెల 2న గ్రామాల వారీగా ఓటర్ల తుది జాబితాలు వెల్లడించారు. దీంతో అడవి రామవరం జిల్లాలో అతి చిన్న గ్రామపంచాయతీగా తేలింది.

2019లో 71 మంది ఓటర్లు

అడవి రామవరం పినపాక నియోజకవర్గం ఆళ్లపల్లి మండలంలో అత్యంత మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో ఎలాంటి రహదారి సౌకర్యం లేని కుగ్రామం . 2018లో అప్పటి ప్రభుత్వం తెచ్చిన పంచాయతీరాజ్ చట్టం ద్వారా మర్కోడు గ్రామం నుంచి విడదీసి అడవి రామవరాన్ని కొత్త పంచాయతీగా ఏర్పాటు చేశారు. గ్రామంలో 105 మంది జనాభా నివసిస్తున్నారు. 2019లో తొలిసారిగా 71 మంది ఓటర్లతో నాలుగు వార్డులకు, సర్పంచ్ పదవికి ఎన్నికలు నిర్వహించారు. సర్పంచ్‌గా ఎస్టీ మహిళ ఎన్నికయ్యారు. గ్రామపంచాయతీ కార్యాలయం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నారు.

గతంలో దొంగతోగు రికార్డు

దొంగతోగు గ్రామం రాష్ట్రంలోనే అతిచిన్న పంచాయతీగా నిలిచింది. ఇది గుండాల నుంచి 2018లో కొత్త పంచాయతీగా ఏర్పాటైంది. 2019లో 36 మంది ఓటర్లతో నాలుగు వార్డులు, సర్పంచ్ స్థానానికి ఎన్నికలను నిర్వహించారు. తాజా లెక్కల ప్రకారం దొంగతోగు గ్రామపంచాయతీ ప్రస్తుతం 88 మంది ఓటర్లతో ద్వితీయస్థానంలో నిలిచింది. ఇందులో పురుషులు 48మంది, మహిళలు 40 మంది ఉన్నారు.

భద్రాచలంలో అత్యధిక ఓటర్లు...

ఈ నెల 2న జిల్లాలోని 471 గ్రామ పంచాయతీల పరిధిలోని 4,168 వార్డులకు సంబంధించిన ఓటరు జాబితాలను ప్రచురించారు. మొత్తం 6,69, 048 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారికంగా లెక్క తేల్చారు. వీరిలో పురుషులు 3,25,045 మంది, మహిళలు 3,43,979 మంది, ఇతరులు 24మంది ఉన్నా రు. పురుషుల కంటే 18,934 మంది మహిళలు అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. గతేడాది సెప్టెంబర్‌లో ప్రకటించిన జాబితా కంటే 45,101 మంది ఓటర్లు ఎక్కువగా నమోదయ్యారు. అడవి రామవరం అత్యల్పంగా 85 మంది ఓటర్లను కలిగిఉండగా, ఆ తర్వాత దొంగతోగులో 88 మంది ఓటర్లు ఉన్నారు. నల్లబండబోడులో 144 మంది, వెంకటేష్‌ఖనిలో 183 మంది, చింతల తండాలో 219 మంది, పెద్దిపల్లిలో 252 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. జిల్లాలో అత్యధికంగా భద్రాచలం గ్రామపంచాయతీలో 20 వార్డుల పరిధిలో 40,761 మంది ఓటర్లు ఉన్నారు.

అతి తక్కువగా ఓటర్లు..



అడవి రామవరం గ్రామానికి సంబంధించిన ఓటరు జాబితాను ఈ నెల 2న పంచాయతీ కార్యాలయంలో ప్రచురించాం. గ్రామంలోని 4 వార్డుల పరిధిలో కేవలం 85 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో అతి తక్కువ ఓటర్లు ఉన్న గ్రామంగా అడవి రామవరం నిలిచింది.

–తంబాల పుష్పరాజ్, కార్యదర్శి, అడవిరామవరం

ఆర్థిక లావాదేవీల్లో వివాదం



డీవీ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులకు నచ్చచెబుతున్న పోలీసులు

- ఇల్లెందు మున్సిపల్ మాజీ చైర్మన్ బావమరిది ఆత్మహత్య
- పంచాయితీలో వేధించారని డీవీపై ఫిర్యాదు



శ్రీనివాసరావు (ఫైల్)

ఇల్లెందు/కారేపల్లి: ఆర్థిక లావాదేవీల్లో ఏర్పడిన విబేధాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా.. మృతుడు, ప్రముఖ కాంట్రాక్టర్ గడిపర్తి శ్రీనివాసరావు(53).. ఇల్లెందు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు (డీవీ)కు వరుసకు బావమరిది కావడం, ఘటనకు డీవీనే కారణమంటూ ఆయన బంధువులు ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. ఇల్లెందు కాకతీయనగర్‌కు చెందిన గడపర్తి శ్రీనివాసరావు – డీవీ కలిసి కొన్నేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం, కాంట్రాక్టు పనులు చేస్తుండగా ఏడాది నుంచి వివాదం మొదలైంది. డీవీ తనకు రూ.కోటిన్నర ఇవ్వాలని శ్రీనివాసరావు చెప్పినట్లు తెలుస్తుండగా, ఇదే విషయమై ఖమ్మంలో శుక్రవారం పెద్దల సమక్షాన పంచాయితీ నిర్వహించినట్లు తెలిసింది. అక్కడ ఆయనను కొందరు దూషించినట్లు సమాచారం. అంతేకాక డీవీ అనుచరుడు దమ్మాలపాటి ప్రసాద్, ఆయన కుటుంబీకులు శ్రీనివాసరావు, ఆయన భార్య విషయంలో అసభ్యంగా మాట్లాడడంతోపాటు బాకీ రూ.కోటిన్నరలో రూ.49లక్షలే ఇవ్వాలని నిర్ణయించినట్లు పలువురితో ఫోన్‌లో చెప్పుకుని వాపోయినట్లు తెలిసింది. ఆతర్వాత ఏం జరిగిందో కానీ కారులో ఇల్లెందు బయలుదేరిన శ్రీనివాసరావుకు రమ రాత్రి 10 గంటల తర్వాత ఫోన్ చేయగా కారేపల్లి క్రాస్ రోడ్‌కు వచ్చినట్లు చెప్పిన ఆయన ఆతర్వాత ఇంటికి చేరకపోగా ఫోన్ కూడా తీయలేదు. ఈక్రమంలోనే కుటుంబీకులు వెతుకుతుండగా కారేపల్లి – ఇల్లెందు మండలాల సరిహద్దు మొట్లగూడెంలోని ఆయన తోట వద్ద కారును గుర్తించారు. అందులో పరిశీలించగా కూర్చున్న స్థితిలోనే మృతి చెంది ఉండడం, పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు.

డీవీ ఇంటి ఎదుట ఆందోళన

శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించగానే కారేపల్లి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ఇల్లెందు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. కానీ ఘటనకు దమ్మాలపాటి వెంకటేశ్వరరావే కారణమంటూ మృతదేహాన్ని ఇల్లెందులోని ఆయన నివాసం వద్దకు తరలించారు. డీవీ ఇంటి ఆవరణలో మృతదేహాన్ని పెట్టి ఆందోళన ఆందోళన నిర్వహించారు. డీవీ వాహనం, ఫర్నీచర్‌ను సైతం ధ్వంసం చేయగా ఇల్లెందు సీఐ సురేష్, కారేపల్లి ఎస్ఐ బి.గోపి, సిబ్బంది అడ్డుకుని ఆస్పత్రికి తరలించారు. కాగా, శ్రీనివాసరావు ఆత్మహత్యకు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కుటుంబసభ్యులు, దమ్మాలపాటి ప్రసాదే కారణమంటూ మృతుడి భార్య రమ ఆరోపించారు. శుక్రవారం ఖమ్మంలో పంచాయితీలో ఉందని సమీప బంధువులు పాకాలపాటి చంద్రయ్య, భారతీరాణి తదితరులతో వెళ్లినశ్రీనివాసరావు మృతదేహంగారావడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.గోపి తెలిపారు. కాగా, ఇల్లెందు ఆస్పత్రిలో శ్రీనివాసరావు మృతదేహాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి కుటుంబీకులను ఓదార్చారు. అయితే, ఖమ్మంలో శుక్రవారం రోజంతా నగదు విషయమై పంచాయితీ జరిగిందని సమాచారం. ఈక్రమాన తనకు రావాల్సిన రూ.1.50కోట్లకు బదులు రూ.49లక్షలే ఇస్తామనడం, పలువురు దూషించడంతోనే శ్రీనివాసరావుఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.



డీవీ ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

డీవీ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు

ఇల్లెందు: ఇంటికి మీదకు వచ్చి దాడి చేసిన సుమారు 50 మంది, అందుకు ప్రోత్సహించిన వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు భార్య బేబి భార్గవి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగిరెడ్డి, జానీపాష ప్రోద్బలంతో మీర్జం బేగ్, గడపర్తి వెంకటేశ్వర్లు, దుద్దుకూరి రోశమ్మ, శృతి, చింతనిప్పు కృష్ణారావు, చింతనిప్పు రాంబాబుతో మరికొందరు తమ ఇంటికి వచ్చి అద్దాలు, తలుపులు ధ్వంసం చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కొత్తగూడెంటౌన్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారంజరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం... రుద్రంపూర్ ఎర్రగడ్డకు చెందిన దొంత్ర బోయినకామేశ్వరావు (36) మహా రాష్ట్ర చంద్రపూర్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో ట్రైనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి మూడేళ్ల క్రితం లావణ్యతో పెళ్లిజరిగింది. వీరికి రెండేళ్ల పాప ఉంది. తరుచుగా కుటుంబ తగాదాలు చోటు చేసుకుంటున్నాయి. శనివారం ఉదయం కూడా భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఆ తర్వాత బయటికెళ్లొచ్చిన కామేశ్వరావు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో వచ్చిన ఎస్ఐ బండారి కిషోర్ మృతదేహాన్ని సందర్శించారు. వివరాలు ఆరా తీశారు. కొన్నిరోజుల క్రితం భార్యాభర్తలు గొడవ పడితే టూటౌన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని యువతి..

గుండాల: మేకలను మేతకు తీసుకెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో ఓ యువతి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఆళ్లపల్లి మండలం పెద్దవెంకటాపురం దేవయ్య గుంపునకు చెందిన గంగమ్మ (17)ను గత నెల 23న తల్లిదండ్రులు మేకలను తీసుకెళ్లమని చెప్పగా ఆమె నిరాకరించింది. దీంతో తల్లిదండ్రులు మందలించగా అదే రోజు పురుగు మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత వైద్యం చేయించేందుకు డబ్బులు లేక ఇంటికి తీసుకొచ్చి మందులు వాడుతుండగా పరిస్థితి విషమించి శనివారం సాయంత్రం మృతి చెందింది. ఈ మేరకు ఆళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

కడవరకు సిద్ధాంతాన్ని వీడని రమేశ్

సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం



నర్రా రమేశ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కమ్యూనిస్టు ఉద్యమం, సిద్ధాంతాలు బలహీనపడిన పరిస్థితుల్లో ఉద్యమాన్ని అంటిపెట్టుకుని కడవరకు నిలిచిన నర్రా రమేశ్ చిరస్మరణీయుడని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. అయితే, కమ్యూనిస్టు ఉద్యమం చిగురిస్తున్న సమయంలో ఆయన మృతి బాధాకరమన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో శనివారం మృతి చెందిన మాజీ కౌన్సిలర్, సీపీఎం నాయకుడు నర్రా రమేశ్ (58) సంతాప సభ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించాక తమ్మినేని మాట్లాడుతూ.. కమ్యూనిస్టు, సోషలిస్టు వ్యతిరేకి అయిన ప్రధాని మోదీ ఇప్పుడు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా ప్రధాని పుతిన్ కలిసి ఫ్రంట్ ఏర్పాటుకు సిద్ధమవడమే కమ్యూనిస్టు ఉద్యమానికి మంచిరోజులు వచ్చాయనేందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రమేశ్ మృతి బాధాకరమని, విద్యార్థి, యువజన ఉద్యమంలో కీలకంగా వ్యవహరించాడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తెలిపారు. కాగా, నర్రా రమేశ్‌కు భార్య నాగలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉండగా నాగలక్ష్మి భద్రాద్రి జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్నారు. సంతాప సభలో కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

పినపాక: పొలంలో పనిచేస్తుండగా పాము కరిచి మహిళ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పాతరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పప్పుల మహాలక్ష్మి (65) పొలంలో పనులు చేస్తుండగా పాము కరిచింది. కుటుంబ సభ్యులు మణుగూరు వంద పడకల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

కలుపు మందు తాగి మహిళ..

ఇల్లెందు: మండలంలోని లచ్చగూడెం గ్రామపంచాయతీ కొమ్ముగూడెం గ్రామానికి చెందిన జర్పుల కమల గుడుంబా మత్తులో శనివారం కలుపు మందు తాగి (70) మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పెన్షన్ నగదుతో రోజూ సారా తాగుతున్న కమల శనివారం అదే మత్తులో కలుపు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఖమ్మం తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

సత్తుపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దమ్మపేట మండలం తొట్టిపంపునకు చెందిన కొర్సా నవీన్ (26) శుక్రవారం రాత్రి సత్తుపల్లి మండలం చంద్రాయపాలెం వద్ద ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

పోటెత్తిన ఆయిల్‌పామ్ గెలలు

అప్పారావుపేట ఫ్యాక్టరీవద్ద బారులుదీరిన 100 ట్రాక్టర్లు



ప్లాట్‌ఫాంపై ఉన్న పామాయిల్ గెలలు



ఫ్యాక్టరీ ప్రాంగణంలో వేచి ఉన్న ట్రాక్టర్లు

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీకి శనివారం ఆయిల్‌పామ్ గెలలు పోటెత్తాయి. ఫ్యాక్టరీ బయట ప్రాంగణంలో గెలలతో వచ్చిన వందకు పైగా ట్రాక్టర్లు బారులుదీరాయి. ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యం గంటకు 90 టన్నులు కాగా సాయంత్రం 5 గంటలకే 2,500 టన్నుల గెలలను ఫ్యాక్టరీలో ప్లాట్‌ఫాం కింద దిగుమతి చేశారు. ఇటీవల కొద్దిరోజులపాటు వర్షాలు కురిశాయి. ఆ సమయంలో గెలల కోత వీలుకాదు. వర్షాలు తగ్గిపోవడంతో రైతులు గెలలు కోస్తుండటంతో ఒక్కసారిగా ఫ్యాక్టరీలకు పోటెత్తుతున్నాయి. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ మాట్లాడుతూ శనివారం రాత్రి వరకు 3 వేల టన్నుల గెలలు రావచ్చని తెలిపారు. రోజుకు సుమారుగా 1,500 టన్నుల మేరకు గెలలను క్రషింగ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఒక వాహనం అన్‌లోడ్ కావడానికి సుమారుగా 3గంటల సమయం పడుతోందని, ఆదివారంనుంచి యథావిధిగా అశ్వారావుపేట ఫ్యాక్టరీకీ గెలలను తరలించవచ్చని వివరించారు.

అశ్వారావుపేటలో సామర్థ్యానికి మించి..

అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి కూడా క్రషింగ్ సామర్థ్యానికి మించి గెలలు వచ్చాయి. సుమారు 700 టన్నుల గెలలు వచ్చినట్లు తెలుస్తుండగా, అంతకు మించి నిల్వ చేసేందుకు స్టాక్‌యార్డు కూడా లేదు. దీంతో శుక్రవారం నుంచి అటువైపు వెళ్లాల్సిన గెలలను కూడా అప్పారావుపేటకే తరలిస్తున్నారు. దీంతో ఇక్కడ కూడా క్రషింగ్ సామర్థ్యానికి మించి గెలలు వస్తున్నాయి. అప్పారావుపేట ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యం గంటకు 90 టన్నులు కాగా, ఆ మేరకు క్రషింగ్ జరగనట్లు తెలుస్తోంది. రోజుకు 1,800 టన్నులను క్రషింగ్ జరగాల్సి ఉండగా యంత్రాల్లోని లోపాల కారణంగా 1,500 టన్నులనే క్రషింగ్ చేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. అశ్వారావుపేట ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యం గంటకు 30 నుంచి 60 టన్నులకు పెంచామని యాజమాన్యం పేర్కొంటున్నా.. ఆ మేరకు క్రషింగ్ జరగడం లేదని రైతులు చెబుతున్నారు.

రూ. 2 లక్షలు పలికిన లడ్డూ



గణపతి లడ్డూతో వ్యాపారి జితేంద్ర

అశ్వారావుపేటరూరల్: వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాట రికార్డు స్థాయిలో ధర పలికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అశ్వారావుపేటలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్దగల శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా శనివారం 37 కేజీల స్వామివారి లడ్డూకు వేలంపాట నిర్వహించారు. అశ్వారావుపేటకు చెందిన సెల్‌ఫోన్ షాపు వ్యాపారి శీమకుర్తి జితేంద్ర అత్యధికంగా రూ.2 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్నాడు. కాగా ఇక్కడి మండపంలో గతేడాది స్వామివారి లడ్డూ వేలం పాటలో రూ.38 వేలు పలికింది.

‘గణేష్’ లడ్డూను కైవసం చేసుకున్న ముస్లిం



వేలంపాటలో లడ్డూ కైవసం చేసుకున్న ఇమామ్

ఇల్లెందు: ఓ ముస్లిం యువకుడు వేలంపాటలో గణేష్ లడ్డూను కైవసం చేసుకుని మతసామరస్యం చాటాడు. పట్టణంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో 6వ లైన్ పరుశురాం యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపంలో శనివారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. దీంతో ముస్లిం యువకుడు ఇమామ్ పాల్గొని రూ. 49,116కు కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా అక్కడి యూత్ సభ్యులు అభినందించారు. కాగా శనివారం ఇల్లెందులో ఘనంగా వినాయక నిమజ్జనం జరిగింది. సత్యనారాయణపురం కుంటలో నిమజ్జనం చేశారు. వినాయక ప్రతిమల ఊరేగింపుతో పట్టణంలో సందడి నెలకొంది.

తహసీల్దార్‌ను బురిడీకొట్టించిన మాఫియా!

పట్టుకున్న ట్రాక్టర్లతో సహా పరారీ



ట్రాక్టర్లను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా అక్రమ రవాణాకు పాల్పడుతున్న మట్టి, ఇసుక మాఫియా ముఠాకు చెందిన కొందరు తహసీల్దార్‌కు చిక్కినట్లే చిక్కి బురిడీ కొట్టించి పారిపోయారు. మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, జగన్నాథపురం, ఊట్లపల్లి గ్రామాల వైపు ఇసుక, మట్టిని ట్రాక్టర్లలో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ సిబ్బందితో కలిసి అశ్వారావుపేట–వినాయకపురం మార్గంలో తనిఖీ లు చేపట్టారు. ఈ క్రమంలో 8 ట్రాక్టర్లను పట్టుకుని పత్రాలను పరిశీలించగా, రెండింటికి మాత్రమే ఇసుక రవాణా అనుమతి పత్రాలు ఉన్నట్లు తేలింది. అనుమతి లేని ఆరు ట్రాక్టర్లను పట్టుకుని తన సిబ్బందితో తహసీల్దార్ కార్యాలయానికి పంపించారు. కాగా, పట్టుబడిన ట్రాక్టర్లను సిబ్బంది కార్యాలయానికి తరలిస్తుండగా, మార్గమధ్యలో ట్రాక్టర్లతో సహా పారిపోయారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ.. ట్రాక్టర్లను సీజ్ చేసేందుకు కార్యాలయానికి పంపించామని, కానీ మార్గమధ్యలో నుంచి పారిపోయినట్లు సిబ్బంది చెప్పారని తెలిపారు. ట్రాక్టర్ల వివరాలను సేకరించి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.